నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 4 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఎల్లంపల్లి ప్రాజెక్టుపైకి మంత్రి శ్రీధర్‌బాబు కాన్వాయ్‌తోపాటు వచ్చిన భారీ వాహనాలు

ఎల్లంపల్లి ప్రాజెక్టుపైకి భారీ వాహనాలను ఎలా అనుమతించారు?

మండి పడుతున్న సందర్శకులు

సాధారణ ప్రజలకు రూల్స్ అండ్ రెగ్యులేషన్లు ఉంటాయి. కానీ.. అధికార పార్టీ నాయకులకు అవి వర్తించవు. పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు మీది నుంచి వాహనాలను అనుమతించడం లేదు. ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో చూసేందుకు వచ్చే సందర్శకులను 100 మీటర్ల నుంచి 150 మీటర్ల దూరంలోనే ఆపేస్తున్నారు. కానీ.. మంగళవారం పరిశీలనకు వచ్చిన ఐటీ శాఖ మాత్యులు మంత్రి శ్రీధర్‌బాబు కాన్వయ్‌తో ఆయన వెంట వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులను, వారి వాహనాలను ఎల్లంపల్లి ప్రాజెక్టు మీదకు అనుమతించారు. వచ్చిన వాహనాలతో ప్రాజెక్టు పైభాగం నిండిపోయి కనిపించింది. దీంతో అక్కడే ఉన్న సందర్శకులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. - మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మంత్రితోపాటు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, జనాలతో నిండిపోయిన ప్రాజెక్టు

తగ్గిన వరద

ఎల్లంపల్లికి ఎగువ నుంచి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- ఐదు లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్న అధికారులు
- మూడు రోజుల వర్షాలకు ఆసిఫాబాద్ జిల్లాలో 1,200 ఎకరాలు
- మంచిర్యాల జిల్లాలో 156.21 ఎకరాల పంట నష్టం
- ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు

మంచిర్యాల, సెప్టెంబర్ 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు కాస్త గెరువిచ్చాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద కాస్త తగ్గుముఖం పట్టడంతో మంచిర్యాలకు వరద టెన్షన్ తగ్గింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి సోమవారం ఉదయం ఆరు లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదలగా.. మంగళవారం సాయంత్రానికి ఐదు లక్షల క్యూసెక్కులకు తగ్గింది. వర్షాలు లేకపోవడంతో రాళ్ల వాగు వరద, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి రావాల్సిన వరద తగ్గింది. ఇప్పుడు కేవలం ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుంచి వరద వచ్చి ఎల్లంపల్లిలోకి చేరుతున్నది. ఆదివారం, సోమవారం ఉన్న తీవ్రమైన పరిస్థితులు కాస్త తగ్గాయి. దీంతో మంచిర్యాల పట్టణవాసులు ప్రస్తుతానికి ఊపిరి పీల్చుకుంటున్నారు. గోదావరిలో మాత్రం వరద ప్రవాహం కొనసాగుతున్నది. మళ్లీ భారీ వర్షాలు కురిస్తే మాత్రం ఇబ్బందులు తప్పవని అధికారులు చెప్పున్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్‌ఫ్లోతోపాటు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వచ్చే వరద పెరిగితే ఎల్లంపల్లి నుంచి అధిక మొత్తంలో నీటిని వదలాల్సి వస్తుంది. మరోక రోజు సాధారణ వాతావరణం కొనసాగితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను మానిటరింగ్ చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద వచ్చిన ఎల్లంపల్లిలో దాన్ని ఆపేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి శ్రీధర్‌బాబు ఎల్లంపల్లి ప్రాజెక్టును మంగళవారం సాయంత్రం పరిశీలించారు. అక్కడ అధికారులను పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆయన వెంట ఉన్నారు.

నీట మునిగిన పంట..

మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో పత్తి, వరి, మిరప పంటలు దెబ్బతిన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో పెనుగంగా వరద ప్రవాహం ఉన్న నేపథ్యంలో నష్టంపై ప్రాథమిక అంచనాకు రాలేకపోతున్నామని అధికారులు తెలిపారు. వరదలు తగ్గాక సర్వే నిర్వహించనున్నారు. నిర్మల్ జిల్లాలో పెద్దగా పంట నష్టం వాటిళ్లలేదు. ఆసిఫాబాద్‌లో జిల్లాలో 900 ఎకరాల్లో పత్తి, 300 ఎకరాల్లో మిరప పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. మంచిర్యాల జిల్లాలో 156 ఎకరాల్లో పంట దెబ్బతింది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ 34 గేట్లు ఎత్తడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారీ వరదలకు పొలాల్లోకి వరద నీరు చేరి, ఇసుక మేటలు వేశాయి. జన్నారం మండలంలోని కవ్వాల్, కొత్తపేట్, కోమనపల్లి, ధర్మారం గ్రామాల్లో 34.8 ఎకరాల్లో 85 మంది రైతులకు చెందిన పంట దెబ్బతిన్నది. చెన్నూర్‌లో 30 రైతులకు చెందిన 40.47 ఎకరాల పత్తి పంట నీట మునిగి నష్టం వాటిళ్లింది. మంచిర్యాలలో 73 మంది రైతులకు సంబంధించిన 80 ఎకరాల పత్తిలోకి నీరు చేరి పంటలు దెబ్బతినట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు.

మంచిర్యాలలో వరదలో మునిగిన పత్తి పంట

పంటనష్టం ప్రాథమిక అంచనా(ఎకరాలు)

మండలం	పత్తి	వరి	రైతులు
జన్నారం	6.07	28.73	85
చెన్నూర్	40.47	0	30
మంచిర్యాల	80.94	0	73
మొత్తం	127.48	28.73	188

వరద బాధితులకు నేను సైతం

సీఎం సహాయనిధికి రూ.3వేలు అందించిన బాలిక

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 3వేల నగదును అందజేస్తున్న విద్యార్థిని

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 3 : వరద ముంపు బాధితులను ఆదుకోవాలనే ఆలోచనతో తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.3వేలను మంగళవారం మహబూబాబాద్ కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా సీఎం సహాయ నిధికి అందిస్తున్న పదో తరగతి విద్యార్థిని ముత్యాల సాయిసింధు. ఈ సందర్భంగా సీఎం సహా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ బాలికను అభినందించారు.

జిల్లా రైతులకు రాష్ట్ర స్థాయి అవార్డులు

బెల్లంపల్లి/హాజీపూర్, సెప్టెంబర్ 3 : తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో రెండవ రాష్ట్ర స్థాయి అభ్యుదయ రైతు అవార్డులకు జిల్లా నుంచి ఇద్దరు రైతులు ఎంపికయ్యారు. వరిపంటలో సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న పాత మంచిర్యాలకు చెందిన గోనే శ్యాంసుందర్‌రావు (హాజీపూర్ మండల ఫార్మా ప్రొడ్యూసర్ కంపెనీ (ఎఫ్‌పీసీ) సలహాదారుడు), మామిడితోటలో సేంద్రియ పద్ధతిలో డ్రిప్ విధానాన్ని పాటిస్తున్న మందమర్రి మండలం మామిడిగట్టుకు చెందిన శ్యాంసుందర్‌రెడ్డికి దక్కాయి. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ యూనివర్సిటీ వ్యవసాయ విద్యాలయం 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులకు అవార్డులను విశ్వ విద్యాలయ వైస్ చాన్స్‌లర్, తెలంగాణ రాష్ట్ర కమిషనర్ రఘునందన్‌రావు చేతుల మీదుగా అందజేశారు. అవార్డులను అందుకున్న రైతులను జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శివకృష్ణ, శాస్త్రవేత్తలు ప్రియసుగంధి, తిరుపతి, స్రవంతి, నాగరాజు ప్రత్యేకంగా అభినందించారు.

అవార్డు అందుకుంటున్న రైతు గోనే శ్యాంసుందర్‌రావు

మెరుగైన వైద్య సేవలందించాలి

డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

మంచిర్యాల అర్బన్/బెల్లంపల్లి/ కన్నెపల్లి, సెప్టెంబర్ 3: జిల్లాలో వర్షాలతో వాతావరణ మార్పులతో మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, తదితర విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తంగా చేస్తూ మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యాధికారులను మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ ఆదేశించారు. మంగళవారం తాళ్లగురిజాల, నెన్నెల, భీమిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. దవాఖానలోని వార్డులు, పరిసరాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యాధికారులు సిబ్బంది సమయపాలన పాటించాలని, గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేసేందుకు కిట్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ సిబ్బందితో సమన్వయంగా ఉంటూ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. 108, 102 అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సుధాకర్ నాయక్, అనిల్, లక్ష్మణ్, కుమారస్వామి, డెమో బుక్క వెంకటేశ్వర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

మంచి మార్కులు సాధించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

లక్షెట్టిపేట,సెప్టెంబర్ 3 : విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించాలని మంచిర్యాల డీఈవో యాదయ్య సూచించారు. మండలంలోని గుల్లకోటతో పాటు, లక్షెట్టిపేట కేజీబీవీలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోధనా తీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులు మంచి ప్రణాళికతో చదివి, టెన్ జీపీఏ సాధించేందుకు కృషిచేయాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలల్లో పలు రికార్డులను పరిశీలించారు. డీఈవో వెంట ఎంఈవో కాసుల రవీందర్, ప్రిన్సిపాల్ కవిత, హెచ్ఎం రవి కాంత్‌రావు తదితరులు ఉన్నారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా

ఎల్లంపల్లి నీటి విడుదల

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హాజీపూర్, సెప్టెంబర్ 3 : హాజీపూర్ మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోనికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుందని, వరద నీటిని లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విడుదల చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు, మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పెద్దపల్లి కలెక్టర్ కోయ హర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్‌తో కలిసి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వచ్చే వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో వరదలపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికార యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అత్యవసర సేవలను అందిస్తున్నారని తెలిపారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థ్యం 20 టీఎంసీలు కాగా ఇప్పటి వరకూ 14.7 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా నీటిని విడుదల చేయాలన్నారు. అత్యవసర సేవల నిమిత్తం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, డీసీపీ భాస్కర్, ఆర్డీవోలు హరికృష్ణ, రాములు, ఏసీపీ ప్రకాశ్, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్‌రావ్ దేశ్ పాండే, ప్రాజెక్టు సీఈ సుధాకర్ రెడ్డి, ఈఈ స్వామి, ఎగ్జిక్యూటివ్ ఈఈ విష్ణుప్రసాద్, డీఈలు శరత్ బాబు, బుచ్చిబాబు, కీర్తి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వస్తున్న వరదను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

మహిళల భద్రతే షీ టీం ప్రధాన లక్ష్యం

రామగుండం కమిషనర్ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 3: మహిళల భద్రతే షీ టీం ప్రధాన లక్ష్యమని రామగుండం కమిషనర్ శ్రీనివాస్ మంగళవారం పత్రిక ప్రకటన పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ లో రెండు షీ టీం బృందాలు పని చేస్తున్నాయని తెలిపారు. షీ టీం ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాలు, స్కూల్స్, కాలేజీల్లో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, టీ సేఫ్ యాప్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్య వివాహాలు, వరకట్నం చట్టాలపై, నూతన మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తునట్లు పేర్కొన్నారు. మహిళలు, బాలికలపై ఆన్‌లైన్‌లో అసభ్యకర పోస్టులు పెట్టే సైబర్ నేరగాళ్లపై కూడా సైబర్, షీ టీమ్ సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని వెల్లడించారు. మహిళలు బాలికలు విద్యార్థులు షీ టీం సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. సమస్యలపై ఎలాగైనా ఫిర్యాదు చేయవచ్చని, ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రామగుండం పోలీస్ కమిషనరేట్ షీ టీం నంబర్ 6303923700కి కాల్ చేసి, వాట్సాప్ ద్వారా సందేశం, డయల్ 100కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

సమావేశంలో పాల్గొన్న వడ్డేపల్లి రామ్ చందర్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 3: షెడ్యూల్డ్ కులాల్లోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సత్వరమే అందించాలని అధికారులకు జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామ్ చందర్ సూచించారు. మంగళవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లోని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, రీసెర్చ్ సభ్యులు వరప్రసాద్, జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావుతో కలిసి షెడ్యూల్డ్ కులాల లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు, బాధితులకు సత్వర న్యాయం, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి ఇతర అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యులు మాట్లాడుతూ ఆర్టికల్ 338 ప్రకారం రాజ్యాంగబద్ధమైన కమిషన్ ద్వారా షెడ్యూల్డ్ కులాల కుటుంబాల సంక్షేమం కోసం కమిషన్ కృషి చేస్తున్నదన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో పాటు డీఈవో అశోక్, డీఎంహెచ్‌వో తుకారాం, డీఆర్డీవో దత్తారాం, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు సజీవన్, డీఎస్పీ వారి శాఖల పరిధిలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అందిస్తున్న సేవలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్ నగర్ ఆర్డీవోలు లోకేశ్వర్ రావు, కాసబోయిన సురేశ్, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, డీటీడీవో రమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

మంచిర్యాలలోని గోదావరి తీరంలో నీట మునిగిన సమ్మక్క, సారలమ్మ గద్దెలు

భయం..భయం

- అటు ఎల్లంపల్లి నుంచి ప్రవాహం
- ఇటు రాళ్లవాగు ఉధృతి
- ఆందోళనలో లోతట్టు ప్రాంతాల ప్రజలు

మంచిర్యాల టౌన్, సెప్టెంబర్ 3 : భారీ వర్షాలు కురిసి తెరిపి నిచ్చినా మంచిర్యాల ప్రజల్లో భయం నెలకొన్నది. ఎల్లంపల్లి ప్రాజెక్టునుంచి పెద్ద ఎత్తున విడుదల అవుతున్న నీరే ఇందుకు కారణం. మరోపక్క మంచిర్యాల పట్టణానికి పక్కలో బల్లెంలా ఉన్న రాళ్లవాగు నిండుగా ప్రవహించడం కూడా ఒకింత ఆందోళనకు కారణంగా మారింది. ఎగువ ప్రాంతంనుంచి భారీగా వచ్చి చేరుతున్న వరదనీటితో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా నీరు వచ్చి చేరుతున్నది. దీంతో అధికారులు 32 గేట్లను పైకి లేపి ఒక సమయంలో ఆరున్నల లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని గోదావరిలోకి వదిలారు. దీంతో మంచిర్యాల పట్టణంలోని ఎన్టీఆర్ నగర్, రాంనగర్, ఎల్ఐసీ కాలనీ, పద్మశాలీ కాలనీల ప్రజలు భయంతో వణికిపోయారు. అటు నుంచి ఎల్లంపల్లి నీరు, ఇటు పక్కనుంచి రాళ్లవాగు నీరు కలిసి ఈ ప్రాంతాల్లోకి వస్తాయన్న ఆందోళనతో వారంతా ఉన్నారు. అందుకే ఎప్పటికప్పుడు నీటి ప్రవాహ ఉధృతి, నీరు విడుదల చేస్తున్న విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. ఎక్కడ ఇద్దరు, ముగ్గురు కలిసినా నీటి ప్రవాహం విషయాన్నే చర్చించుకోవడం కనిపించింది. ఎల్లంపల్లి ప్రాజెక్టునుంచి భారీగా విడుదలవుతున్న నీటితో గోదావరిలో నీటి ప్రవాహం పెరిగింది. పట్టణంలోని పుష్కరఘాట్ గద్దెలు నీట మునిగాయి. మరోపక్క సమ్మక్క, సారలమ్మ గద్దెలు సైతం నీట మునిగాయి. ఏ సమయంలో ఎలాంటి ఆపద వచ్చినా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంది. నదీ ప్రవాహాలకు దగ్గరగా ఉన్న నివాసాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. కొంత మందిని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నీటి ప్రవాహం వైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

ఎన్టీఆర్ నగర్ వద్ద నిండుగా ప్రవహిస్తున్న రాళ్లవాగు

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679